ఒక్కసారి ఆమె దృష్టి టీపాయ్‌మీద వున్న ఉంగరం మీద పడింది.

" రాఘవేంద్ర నాయుడుగారూ!" ఆ పిలుపుకి నాయుడుగారు ఉలిక్కిపడ్డారు. ముందుగా ప్లాన్ ప్రకారం మధుకర్ మేనమామగా పరిచయం చెయ్యమని ఆయనే రవికిరణ్ తో చెప్పాడు.

కాని మహతికెలా తెల్సింది? రాఘవేంద్ర నాయుడు విస్మయంగా చూసాడామెవేపు.

"మీ ఉంగరం" అంది మహతి చిర్నవ్వుతో.

రాఘవేంద్ర నాయుడుగారికో అలవాటుంది. అది- తను మాట్లాడుతున్నప్పుడు, తన వేలికున్న ఉంగరాన్ని బయటకు తీసుకోవటం, పెట్టుకోవటం ఆయన కలవాటు-- అప్పుడప్పుడు అలా మరచిపోవటంకూడా జరుగుతుంటుంది.

"ది గ్రేట్ బిజీ బిజినెస్ మేగ్నెట్‌ని ఇలా చూడగలనని ఊహించనైనా లేదు, మిమ్మల్ని చూసాక నా అభిప్రాయాలు మరింత సాంద్రతను సంతరించుకుంటాయి. థాంక్యూ వెరీమచ్ సర్" అంది మహతి. అంత పెద్ద వ్యక్తిని ప్రత్యక్షంగా, అతి సమీపంగా చూడగలిగినందుకు ఎక్సైట్‌మెంట్‌కి గురవుతూ.

*　　　　*　　　　*　　　　*

"ఇది నా పాకెట్ మనీతో నేను కొనుక్కున్న సూట్‌కేస్. ఇందులో ఉన్న రెండు జతలూ నేను కొనుక్కున్నవే. ఇప్పుడు నా దగ్గరున్న డబ్బు- వెయ్యిరూపాయలు. ఈ డబ్బు మాత్రం నాది కాదు మీది. మీ డబ్బు మీ కిచ్చేస్తున్నాను. తీసుకోండి" అంటూ టీపాయ్‌మీద కొడుకు పెట్టిన డబ్బుకేసి దిగ్భ్రాంతిగా చూశాడు నాయుడు.

హేట్సాఫ్ మహతి.. హేట్సాఫ్.. మనసులోనే అనుకున్నాడు నాయుడు.

క్షణాల్లో ఆయన్లోని నిజమైన వ్యాపారవేత్త నిద్రలేచాడు.

"స్పర్థయా వర్ధతే విద్యా అన్నారు పెద్దలు. ఇద్దరి మధ్య ఆరోగ్యకరమైన స్పర్ధ వుంటేనే విద్య వర్ధిల్లుతుందని దాని అర్థం. మీ యిద్దరి మధ్య ఇంత చాలెంజ్ ఎందు

కొచ్చినప్పటికీ-- చివరకు అది ఎలా పరిణమించినప్పటికీ -- నువ్వొక్కడివే బయటకు వెళ్తే ఏమిటి ప్రయోజనం? దాంట్లో థ్రిల్ ఏముంటుంది? లెట్ హెర్ ఆల్సో కమ్ అవుట్.

ఆ అమ్మాయినీ బయటకు రమ్మను.

ఇద్దరూ కట్టుబట్టలతో బయటకు వెళ్ళండి.

ఇద్దరు చాలెంజింగ్‌గా నిలబడండి.

పోటీ ..... స్పర్థ ..... చాలెంజ్ ..... సవాల్ ..... కరేజ్ ..... అస్థిత్వపు పోరాటం ..... ఎదగాలనే ఆరాటం. వీటన్నిటికి అర్థం కల్పించాలంటే, ఆ అమ్మాయినికూడా బయటకు రమ్మని నువ్వు చాలెంజ్ చెయ్యి. ఆ అమ్మాయి మాత్రమే నీమీద చాలెంజ్ విసరటంలో ఔచిత్యం లేదు. ఆలోచించు" ఒక పథకం ప్రకారం కావాలనే అలా లీడ్ చేశాడు రాఘవేంద్ర నాయుడు.

తను విసరని చాలెంజ్ తన తండ్రి తనకు గుర్తుకుతెచ్చినందుకు తండ్రివేపు కృతజ్ఞతగా చూశాడు మధుకర్ . డబ్బునలాగే వదలి రాఘవేంద్ర నాయుడు లోపలకు వెళ్ళాడు.

*　　　*　　　*　　　*

మూడు గంటలు ఒంటరిగా తలుపులేసుకొని తన గదిలోకూర్చుండిపోయాడు మధుకర్ .

తను చేస్తున్నది తప్పో, ఒప్పో తెలీని స్థితి.

ఏది ఏమైనా ఒకసారి చాలెంజ్ విసిరితే దానిలో నెగ్గేవరకు తనకు మనశ్శాంతిగా ఉండదు. ఎందుకొచ్చినా, తనీ చాలెంజ్‌లో గెలిచితీరాలి.

వెంటనే ఫోన్ దగ్గరకు లాక్కుని మహతికి రింగ్ చేశాడు.

మహతే లిఫ్ట్‌చేసింది ఫోన్‌ని.

"నేను మధుకర్‌ని."

"హాయ్ మధు. చాలెంజ్ నిలబెట్టుకోలేనని చెప్పటానికి ఫోన్ చేసావా?" సర్క్కాస్టిగా అంది మహతి.

మధుకర్ పళ్ళు నూరుకున్నాడు.

"వెనకడుగు వేయటం నా జీవితంలో లేదు. నాకు విసిరిన చాలెంజ్‌ని నిలబెట్టుకోటానికి సంసిద్ధమై ఉన్నాను. మరికొన్ని గంటల్లోనే కట్టుబట్టలతో బయటకు వెళ్ళిబోతున్నాను."

"మరి?!"

"నేను నీకేం చాలెంజ్ విసరలేదే? అందుకే ఫోన్ చేస్తున్నాను. అంత పౌరుషం ఉన్నదానివి నువ్వూ నాలాగే కట్టుబట్టలతో బయటకు రావటం సబబుకదా? లేదంటే - అయ్యో నేను ఆడపిల్లనే అని అనుకుంటే చెప్పు వదిలేస్తాను" హేళన చేస్తున్నట్లుగా అన్నాడు.

ఫోన్‌కి ఆవల ఉన్న మహతి ఒక్క క్షణం ఉలిక్కిపడింది-ఆ పైన తనూ అలాగే చేస్తానని చెప్పనందుకు సిగ్గుపడింది- మధుకర్‌కే తనమీద తిరుగు చాలెంజ్ విసరాలనే ఐడియా వచ్చిందా లేక మరెవరన్నా ప్రోద్భలం ఉందా అని అనుమానించింది. అది ఒక్క క్షణమే.

"ఓకే ..... చాలెంజ్ ..... నేనూ సిద్ధమే" అంది పట్టుదల ధ్వనిస్తున్న కంఠంతో.

*  *  *  *

డైనింగ్ టేబుల్ దగ్గరకొచ్చి కుర్చీ లాక్కుంటూ కూర్చుని, పక్కన టిఫిన్ చేస్తున్న కూతురు మహతి వేపు చూశాడు రాజేంద్ర ప్రసాద్. ఎదురుగా భార్య ఉషాకుమారి.

"మీ డాడీ నీతో ఏదో చెప్పాలనుకుంటున్నారమ్మా" భర్త మనసులో భావాన్ని గ్రహించి అంది ఉషాకుమారి .

“వాట్ ..... డాడ్ ..... ”

“సరైన వయసులో ఆడపిల్లకి పెళ్ళి చెయ్యడం, పేరెంట్స్ రెస్పాన్స్‌బిలిటీ. అవునా, కాదా” తల్లి చెప్పింది.

“అబ్బాయి అమెరికాలోని ఓరగాన్‌లో మెకానికల్ ఇంజనీర్‌గా ఉంటున్నాడు. మీ మమ్మీకి, నాకూ, ఆ మాచ్ నచ్చింది. నిన్ను చూడ్డానికి అబ్బాయి వస్తాడు” చెప్పాడు రాజేంద్ర ప్రసాద్.

“ఆ మాచ్ ఫైనలైజ్ చేసారా మీరు” అడిగింది మహతి.

“ఆ అబ్బాయి నిన్ను చూడటం ఒక్కటే మిగిలింది ..... ” తల్లి అంది.

“నాకా సంబంధం ఇష్టంలేదు.”

“ఆ అబ్బాయి ఫోటోకూడా చూడకుండానే.”

“అక్కర్లేదు. ఫోటో చూడాల్సిన అవసరం లేదు. నాకీ సంబంధమేకాదు. మీరు తెచ్చే  ఏ మ్యాచ్ నాకిష్టంలేదు.” చాలా స్పష్టంగా తన అభిప్రాయాన్ని చెప్పటం మహతికి మొదటినుంచీ అలవాటు చేశాడు రాజేంద్ర ప్రసాద్.

అందుకే ఆ తల్లిదండ్రులు ఏమీ ఆశ్చర్యపోలేదు. కానీ యిలా వ్యతిరేకిస్తుందని మాత్రం అనుకోలేదు.

“ఏ సంబంధమూ నీకక్కర్లేదంటే పెళ్ళి చేసుకోవా. సన్యాసుల్లో కల్సిపోతావా” తల్లి అడిగింది.

“అంత వైరాగ్యం నాకు రాలేదు. మొదట్నుంచీ, నా ఇష్టాల కనుగుణంగా పెంచాడు. పెళ్ళి విషయంలోకూడా నా ఇష్టాన్ని కాదనరని అనుకుంటాను” ఆరెంజ్ జ్యూస్ గ్లాసు తీసుకుంటూ అంది మహతి.

“ఎవరినైనా ప్రేమిస్తున్నావా?” ఉషాకుమారి మాటల్లో కోపం ధ్వనించింది.

మెల్లగా జ్యూస్ సిప్ చేస్తోంది మహతి.

"నీక్కావలసిన ఏ వస్తువునయినా నువ్వు కోరుకోవడంలో తప్పులేదు. కానీ ఇది నీ పెళ్ళికి సంబంధించిన విషయం. నూరేళ్ళ జీవితానికి సంబంధించిన విషయం. అందుకే ..... "

"అందుకే నేను జాగ్రత్తగా ఆలోచించి ఓ నిర్ణయానికొచ్చాను"

"ఏమిటా నిర్ణయం"

"నేనూ మా క్లాస్‌మేట్‌ని ప్రేమిస్తున్నాను."

"అతను నిన్ను ప్రేమిస్తున్నాడా"

"తెలీదు. కానీ నా ప్రేమను కాదనడు. నాకా నమ్మకంవుంది."

"ఆస్తిపరుడా"

"కోటీశ్వరుడు"

"ఎవరతను" ఆ ప్రశ్న అడిగింది రాజేంద్ర ప్రసాద్.

" మధుకర్ " నెమ్మదిగా చెప్పింది మహతి.

" మధుకర్ ..... అంటే ..... రాఘవేంద్ర నాయుడు కొడుకు ..... అంటే ..... మొన్న సిటిజన్ క్లబ్‌లో నాన్సెన్స్ క్రియేట్ చేసిన కుర్రాడు ..... అతనేనా" తండ్రి సీరియస్‌గా అడిగాడు.

"ఎస్ డాడ్"

"అతని గురించి పూర్తిగా నీకు తెలుసా" సూటిగా తన కళ్ళల్లోకి చూస్తూ అడుగుతున్న ఆ ప్రశ్నకు జవాబు చెప్పలేకపోయింది మహతి.

"తెలుసు"

"వాట్ డూ యూ నో ఎబౌట్ హిమ్ ..... అర్ధరాత్రి వరకూ అతను బార్లల్లో దొర్లుతాడని తెల్సా! ఇష్టవొచ్చిన అమ్మాయి వెనక తిరుగుతాడని  తెల్సా? లక్షలకు లక్షలు ఇష్టవొచ్చినట్టుగా ఖర్చుపెడతాడని తెల్సా? నీకేం తెల్సు? అతన్లో ఏ గుణం చూసి నువ్వు ప్రేమించావో, ఒక్క సుగుణం నాకు చెప్తావా" రెట్టించాడు తండ్రి కోపంగా.

"బార్లలో దొర్లడం , అమ్మాయిల వెనకపోవడం అతని బలహీనతలు కావొచ్చు. జల్సాగా డబ్బు ఖర్చు చెయ్యడం అతని సర్దా కవచ్చు. అంతమాత్రం చేత అతనికో ఇండివిడ్యువాలిటీ వుండదనీ ఎందుకనుకొంటున్నారు? అతనికిప్పుడున్న బలహీనతలే లైఫ్ లాంగ్ వుంటాయని అనుకోవడం తప్పని నా ఒపీనియన్."

కూతురలా మాట్లాడ్డం ఆశ్చర్యంగా వుంది ఉషాకుమారికి.

"నీకతనిలో కన్పించిన ఇండివిడ్యువాలిటీ ఏంటో చెప్పమని అడుగుతున్నాను. ఎదుటి వ్యక్తిని ప్రవోక్ చెయ్యడంవల్ల ఎన్ని ఉపయోగాలున్నాయో ఆ బిజినెస్ మెన్‌కి తెలుసు."

"యుద్ధం చేసిన తర్వాత, రక్తపాతాన్ని చూసిన తర్వాత అశోకుడు శాంతివాది అయ్యాడనే విషయం మీకు తెలీదనుకోను. రాజ్యాధికారం చెలాయించిన తర్వాత, సంసార మూలం తెల్సిన తర్వాత సిద్ధార్థుడు బుద్ధుడయ్యాడనే విషయం మీకు తెలీదనుకోను. No accurate thinker will judge an other person by that which the other person's enemies say about him..... మీరు మధుకర్ విషయంలో పొరపాటు పడుతున్నారంటాను. ఇవాళ అతనిలో వున్న గుణాలు పర్మనెంట్‌గా వుంటాయనుకోను. నాకా నమ్మకం వుంది."

రెండు నిమిషాలు రాజేంద్ర ప్రసాద్ మాట్లాడలేదు.

“కోటీశ్వరుడని ప్రేమిస్తున్నావా?” ఆ గొంతులోని వెటకారానికి ఒళ్ళు మండిపోయింది మహతికి.

“లేదు!”

“మరి?”

తను అతనితో చాలెంజ్ చేసింది. అనుకున్న టైమ్‌కి అతను ఇంట్లోంచి బయటికొస్తే .....

తనూ బయట పడాలి. అందుకే తను మెంటల్‌గా ప్రిపేర్ అయింది. కానీ తల్లిదండ్రుల్ని కూడా అందుకు సిద్ధంగా వుంచాల్సిన పరిస్థితి తనమీద వుంది.

అందుకే ఈ ప్రయత్నం.

తప్పదు- తను అమితంగా ప్రేమించే తల్లిదండ్రుల్ని బాధ పెడుతోంది. జీవితంలో తల్లిదండ్రులకన్నా, తోడబుట్టిన అన్నదమ్ములకన్నా లక్ష్యం గొప్పది.

ఒక లక్ష్యం కోసం నువ్వు రోడ్డుమీద పడినా తప్పులేదు. ఒక లక్ష్యం కోసం నువ్వు చచ్చిపోయినా ఫర్వాలేదన్నది తను విశ్వసించే సత్యం.

“ఐ లవ్ హిమ్! దట్సాల్!”

“ఇప్పుడు ఫోన్ చేసింది అతనేనా?” అడిగింది తల్లి.

“అవును.”

“నేనూ రెడీయే అనన్నావ్! ఇద్దరూ కల్సి పెళ్ళి చేసుకొంటున్నారా?” అనుమానంగా అడిగింది తల్లి.

తల్లి అనుమానానికి నవ్వొచ్చింది.

“రహస్యంగా పెళ్ళి చేసుకోడానికి నేనంత పిరికిదాన్ని కాదమ్మా! మీరు లేకుండా మాత్రం నా పెళ్ళి జరగదు. బైదిబై డాడీ? మీకు చెప్పాల్సిన ముఖ్యమైన విషయం ఒక సంవత్సరంపాటు నా మట్టుకు నన్ను వదిలేయండి. ఐ వాంట్ టు లివ్ ఆన్ మై ఓన్, కారణాలు మాత్రం అడక్కండి.”

రాజేంద్ర ప్రసాద్ ఆశ్చర్యంగా చూషాడు కూతురివైపు.

కూతురు కేమైనా పిచ్చి పట్టిందా అన్నట్టు చూస్తోంది తల్లి ఉషాకుమారి .

“డాడీ! చిన్నప్పట్నించీ నన్నెలా పెంచారో ఒక్కసారి గుర్తుకుతెచ్చుకోండి. ఎవ్వరిమీదా ఆధారపడకుండా నువ్వు బతకాలమ్మా అని మీరన్న విషయం కూడా గుర్తుంచుకోండి.

అందుకే నేనీ నిర్ణయం తీసుకున్నాను.

తండ్రులమీద, తండ్రుల ఆస్తులమీద ఆధారపడే కొడుకులు, నాకు పెళ్ళి కొడుకులుగా అఖ్కర్లేదని నేననుకుంటున్నప్పుడు,

నేను నా తల్లిదండ్రుల మీద ఆధారపడడం తప్పుకదూ!

అందుకే- నేనీ నిర్ణయం తీసుకున్నాను.

నా నిర్ణయం ఏ తప్పుకు దోహదం చేస్తుందోనని మీరు కంగారు పడాల్సిన అవసరం లేదు.

ఆడపిల్ల బయట ప్రపంచంలో వంటరిగా ఎలా బతుకుతుందని అనుకోవద్దు. మగవాడు బయటకు వచ్చినపుడు వాడు బతకడానికి, ఏయే మార్గాలుంటాయో, ఆడపిల్ల బతకడానికి కూడా అవ్వే మార్గాలుంటాయి. కానీ వెతుక్కోవడంలోనే వుంది. స్పష్టమైన లక్ష్యాన్ని నిర్ణయించుకుని, నిజాయితీ మార్గంలో, తెలివి తేటల్ని ఏ మాత్రం వృధాగా పోనియ్యకుండా, కష్టాపడిన వాడు. తప్పకుండా సత్ఫలితం వస్తుందన్న నమ్మకం  మీ ద్వారానే నాకు తెల్సింది.

మీరెప్పుడూ అంటుంటారు గుర్తుందా?

**Yesterday is but a cancelled cheque.**
**Tomorrow is a promissory note.**
**Today is ready cash, spend it wisely**

అందుకే నేనీ నిర్ణయం తీసుకున్నాను ” చెప్పడం ఆపింది మహతి.

“అది కాదే, నువ్వు బయటకెళ్ళేది డబ్బు సంపాదించడానికే గదా! ఆ డబ్బు మన దగ్గర లేదా? డాడీ డబ్బు నీ డబ్బు కాదా? ఈ నగలు, ఈ బంగళా నీది కాదేమిటి? దీనికి పిచ్చి ఆలోచన ఏమిటండీ! మీరైనా చెప్పండి” భోళామనిషి, తల్లి బేలగా భర్తని అభ్యర్థించింది. అప్పటికే అ తల్లి కళ్ళలో నీళ్ళు సుడులు తిరుగుతున్నాయి.

“మమ్మీ! నీకు తెలీదు. నువ్వూరుకో” చిరాగ్గా అంది.

“ఏమిటే నాకు తెలీదు. నీ పిచ్చితనాన్ని సమర్థిస్తే నాకు తెల్సినట్టా. భయం లేకపోతే సరి.”

రాజేంద్ర ప్రసాద్ పెదవి విప్పాడు.

“ఓకే మహీ ..... నీ అభిప్రాయాల్ని నేను గౌరవిస్తున్నాను. నువ్వు తీసుకున్న ఈ నిర్ణయం చాలా మందియువతులకు ఇన్స్ఫిరేషన్ ఇవ్వాలని, ఇస్తుందని నా నమ్మకం. కానీ నువ్వు నాకు ఓ హామీ నివ్వాలమ్మా!” కూతురు జుత్తును ప్రేమగా నిమురుతూ అన్నాడాయన.

“చెప్పండి డాడీ!”

“మానసికంగా గానీ, శారీరకంగా గానీ నీకే రకమైన ఇబ్బంది కలిగినా, నన్ను కాంటాక్ట్ చెయ్యడం మర్చిపోకు గుర్తుంచుకో.”

*　　　*　　　*　　　*